క్లుప్తంగా

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



మాట్లాడుతున్న సాయికుమార్

రణస్థలం: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులు పిన్నింటి సాయికుమార్ అన్నారు. , సీఎం చంద్రబాబుకు ఇది చెంపపెట్టన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంకుశంగా, అప్రజాస్వామికంగా, అరాచకంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గట్టిగా బుద్ధి చెప్పిందన్నారు. ప్రాథమిక హక్కులకు, స్వేచ్ఛకు భంగం కలిగేలా వ్యవహరించడం సరికాదనే విషయం ఈ తీర్పుతో స్పష్టమైందన్నారు. మహిళల నిరసన పేరుతో సాక్షి మీడియా కార్యాలయంపై దాడి చేయడం అమానుషమని, మీడియా స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని కూనీచేయడమేనని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, నాయకులు గురాన ప్రసాద్, కిల్లారి సూర్యానారాయణ, పిన్నింటి లక్ష్ముంనాయుడు, మింది శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

వెటర్నరీ ఆస్పత్రి ఏడీగా బాలకృష్ణ



ఏడీ బాలకృష్ణను అభినందిస్తున్న వైద్యులు, సిబ్బంది

గార: గార ఏరియా వెటర్నరీ ఆస్పత్రి సహాయ సంచాలకుడిగా డాక్టర్ బాలకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈయన పొందూరు మండల ఏడీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడి వచ్చారు. గతంలో పని చేసిన ఏడీ జి.రాజశేఖర్ విశాఖపట్నం ఐఎస్‌డీపీకి ఏడీగా బదిలీ కాగా, కొద్ది నెలలుగా బాలకృష్ణ ఇన్‌చార్జి ఏడీగా కొనసాగుతున్నారు. బాధ్యతలు స్వీకరించడంతో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ దిలీప్, వైద్య సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



కిరణ్‌కుమార్

రణస్థలం: రణస్థలం మండల తహసీల్దార్‌గా సనపల కిరణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాతపట్నం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఎస్.ప్రసాద్ పాతపట్నం బదిలీ అయ్యారు. 2024 ఎన్నికల ముందు కిరణ్‌కుమార్ ఏడాది పాటు రణస్థలంలో పని చేసి మరలా ఇక్కడకు విచ్చేశారు.

రేపు ఒలింపిక్ డే రన్ సన్నాహక సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో ఈ నెల 23న నిర్వహించనున్న ఒలింపిక్ డే రన్‌కు సంబంధించి ఆదివారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని డీఈఓ కార్యాలయానికి ఆనుకుని ఉన్న జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి ఒలింపిక్ సంఘ ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు, వివిధ క్రీడాసంఘాల అధ్యక్ష కార్యదర్శులు, ప్రతినిధులు, డీఎస్‌ఏ కోచ్‌లు, వెటరన్ క్రీడాకారులు, పీడీ, పీఈటీలు, కోచ్‌లు, క్రీడాభిమానులు తరలిరావాలని సాంబమూర్తి కోరారు. సమావేశానికి కృష్ణదాస్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, డీఎస్‌ఏ అధికారులు హాజరవుతున్నట్టు సాంబమూర్తి చెప్పారు. జూన్ 23న ఒలింపిక్స్ డేగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లాలో కొన్ని దశాబ్దాలుగా ఒలింపిక్ డే రన్‌ను పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేట గ్రామంలోని దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. రాజరాజేశ్వరీదేవీని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. శ్రీచక్రాల వద్ద కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

వేడుకలకు వేళాయె..!



శ్రీభూ సహిత వేంకటేశ్వరస్వామి

ప్రధాన ఆలయం

- 15 నుంచి డీసీసీబీ కాలనీలో వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం
- స్వామివారి కల్యాణ వేడుకలకు ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో భూ సమేత వేంటేశ్వర స్వామి దేవాలయం వార్షికోత్సవాలకు సిద్ధమైంది. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఇక్కడ కొలువుదీరి భక్తుల కొంగు బంగారంగా నిత్య పూజలు అందుకుంటున్నారు. దాతల సహకారంతో నిర్మాణ జరిగిన ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ ఆ ప్రాంతవాసులకు ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోంది. ప్రధాన ఆలయ నిర్మాణం, ఉపాలయాలు, అర్థమండపం, గరుడాళ్వార్లు, ధ్వజ స్తంభం, భోగశాల, సాలహార నిర్మాణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. శ్రీదేవి, భూదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవారు, గోదాదేవి, ఆళ్వారులు, బలిపీఠాలను తిరుమల తిరుపతి నుంచి తెప్పించారు. ఆరున్నర అడుగుల స్వామివారి విగ్రహం ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా నిలుస్తోంది. భక్తుల సహకారంతో స్వామివారికి వెండి కవచం, అమ్మవార్లకు వెండి కిరీటాలను



అర్థమండపం

సమకూర్చారు. చిన్న జియ్యరు స్వామి కూడా స్వామిని దర్శించుకుని భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు.

నిత్యపూజలు..

వేంకటేశ్వరస్వామివారిని నిత్యపూజలతో ఇక్కడి భక్తులు కొలుస్తున్నారు. ప్రతినెలా స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం రోజున శ్రీదేవి, భూదేవి సహిత స్వామివారి కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. తిరుప్పావై ప్రవచనాలు, గోదా రంగనాథుల కల్యాణోత్సవం, ప్రతి శుక్రవారం లక్ష్మీ పూజలు, విష్ణు సహస్రనామ పారాయణలు, శ్రీసీతారాముల కళ్యాణాలు, హనుమత్ జయంతి జరుగుతున్నాయి.

వార్షిక కల్యాణోత్సవాలు..

కల్యాణ వేంకటేశ్వరస్వామి నాలుగో వార్షికోత్సవాన్ని ఈ నెల 15 నంచి మూడురోజుల పాటు నిర్వహించేందుకు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు దుంపల సన్యాసిరావు, అధ్యక్ష, కార్యదర్శులు బిందు కృష్ణ, కొత్తకోట మధుసూదనరావు, ట్రెజరర్ శిష్టు ఉతాసన తెలిపారు. 15న ధ్వజారోహణం, విశ్వక్సేన పూజలు, ఆధ్యాత్మిక జీవన జ్ఞాననిధి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, అనంతరం శ్రీవారి కల్యాణ వేడుకలు, 16న స్వామివారికి విశేషపూజలు, మండపారాధనలు, హోమాలు, అన్నప్రసాద వితరణ, సామూహిక కుంకుమార్చనలు, 17న గరుడవాహన సేవ, పుష్పయాగ మహోత్సవం జరుగుతాయని వివరించారు.

ముక్తిమార్గానికి..



స్వామిని దర్శించుకుంటే ముక్తి లభిస్తుంది. ఎంతో మహిమ గల స్వామికి నిత్య పూజలతో విశేష పూజలతో ఆలయం అలరారుతోంది. వార్షిక కల్యాణోత్సవంలో అందరూ పాల్గొనాలి.

– చామర్తి గోపాలాచార్యులు, ప్రధాన అర్చకులు

భక్తుల ఆదరణతో..



అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు. భక్తుల సహకారంతో త్వరలో స్వామివారికి బంగారు కిరీటం చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– దుంపల సన్యాసిరావు, ఆలయ గౌరవ అధ్యక్షుడు

యోగాసనాలు జీవితంలో భాగంకావాలి



యోగా చేస్తున్న పీసీబీ అధికారులు, పౌరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): యోగాసనాలు జీవితంలో భాగం కావాలని జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ అన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ప్రతి రోజు ఇంటి వద్దే యోగాసనాలు చేసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపరచుకోవచ్చని చెప్పారు. యోగాసనాలతో వ్యాధులు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు పాండ్రంకి మురళీకృష్ణ, ఆయుష్ శాఖ చంద్రశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ హరీష్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది, నగర ప్రజలు పాల్గొన్నారు.

17న లావేరు మండల సమావేశం

ఎచ్చెర్ల: లావేరు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీన మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించనున్నామని ఎంపీడీవో పి.వెంకటరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ అధ్యక్షతన జరగనున్న సమావేశాని మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా



మాట్లాడుతున్న మధుసూదనరావు

జి.సిగడాం: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని ఎస్‌ఐ వై.మధుసూదనరావు హెచ్చరించారు. గ్రామాల్లో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. వాహనదారులు విధిగా అన్ని హెల్మెంట్ ధరించాలని, వాహానానికి చెందిన అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

ఎచ్చెర్లలో భారీ వర్షం



అల్లినగరం జంక్షన్ వద్ద కురుస్తున్న వర్షం

ఎచ్చెర్ల: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. అల్లినగరం, చిలకపాలెం ఎచ్చెర్ల గ్రామంలో ఉరుములుతో కూడిన వర్షం పడింది. భారీ వర్షంతో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉండగా.. సరుగుడు, నీలగిరి మొక్కలు వేసే రైతులు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు



ఎచ్చెర్ల: గోతులమయమైన కొయ్యాం రోడ్డు

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల జంక్షన్ నుంచి కొయ్యాం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారయ్యింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్డు గతుకులమయమైంది. అడుక్కో గొయ్య ఉండడంతో వాహన, పాదచారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రణస్థలం: మండలంలోని తెప్పలవలస పంచాయతీ మీసాలపేట నుంచి సీతారాంపురం గ్రామానికి వెళ్లే రోడ్డు నరకాన్ని చూపిస్తోంది. చిన్న చినుకుపడినా రోడ్డు బురదమయమై ప్రయాణానికి వీలులేకుండాపోతుంది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. కూటమి నాయకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రణస్థలం: అధ్వానంగా ఉన్న మీసాలపేట-సీతారాంపురం రోడ్డు

పుస్తకాలు పంపిణీ



రణస్థలం: విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు అన్నారు. జె.ఆర్.పురం హైస్కూల్లోని విద్యార్థులకు విద్యా మిత్ర కిట్లు, పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్నం పథకానికి ప్రభుత్వం తరఫున బియ్యాన్ని అందించారు. ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, కూటమి నాయకులు ఉన్నారు.



ఎచ్చెర్ల: కిట్లను అందజేస్తున్న హెచ్ఎం పూర్ణచంద్రరావు

ఎచ్చెర్ల: బుడుమూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను ప్రధానోపాధ్యాయులు పూర్ణచంద్రారావు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు ప్రసాద్, గోవిందరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులపై పనిభారం తగ్గించాలి



మాట్లాడుతున్న ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బీఆర్ కృష్ణ

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులపై పని భారాన్ని తగ్గించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బీఆర్ కృష్ణ, కె.బాబూరావు డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం రెండో డిపోలో సమస్యల పరిష్కారం కోసం శనివారం నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామని ప్రకటించారు. పని భారం వెంటనే తగ్గించి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. విత్తనాలకు పంపే గూడ్స్ సర్వీసులకు 36 గంటల పనిని కేటాయిస్తున్నారని, దానికి అదనంగా డ్యూటీగానీ, అలవెన్సులు గానీ ఇవ్వడం లేదని, కనీసం హెల్పర్‌ను కూడా ఇవ్వడం లేదన్నారు. కొత్తూరు ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు రూట్ సర్వేలు చేయాలని, టైమింగ్ చాలకపోవడంతో డ్రైవర్లపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. టైర్లపై డ్యామేజులు, రికవరీలు చేస్తున్నారని, అక్రమంగా చార్జ్‌షీట్‌లు ఇస్తున్నారని, సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు దుర్గారావు, బి.ఎస్.బాబు, బి.ఆనందరావు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోనే ప్రజల నుంచి తిరుగుబాటు



శ్రీరామమూర్తి

జి.సిగడాం: కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే ప్రజల నుంచి తిరుగుబాటు వచ్చిందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. ఆనందపురం గ్రామంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ నెల నాలుగో తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి భారీస్థాయిలో తరలివచ్చిన జనాన్ని చూసి కూటమి ప్రభుత్వానికి వణుకుపుట్టిందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు సూపర్ సిక్స్‌తోపాటు మరో 143 హామీలను ఇచ్చి గద్దె ఎక్కిన చంద్రబాబు ఏడాది కాలంలో ఒక్క పథకాన్ని కూడా అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారన్నారు.

వృద్ధులపై వివక్ష మానవహక్కుల ఉల్లంఘనే



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వృద్ధుల హక్కులు, సంక్షేమం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమీపంలోని శాంతా అనురాగ కళ్యాణ నిలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎం.శ్రీధర్ మాట్లాడుతూ భవిష్యత్తుకు బాటలు వేసిన వృద్ధులను కుటుంబ సభ్యులు నిర్లక్ష్యం చేస్తూ అనాథాశ్రమాలలో వదిలేస్తుండటం దురదృష్టకరమని, ఇది మానవ హక్కుల ఉల్లంఘనేనని పేర్కొన్నారు. వృద్ధుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలు, పథకాలపై అవగాహన కల్పించారు. వృద్ధులకు వేధింపులు ఎదురైతే న్యాయ సేవాధికార సంస్థను వెంటనే సంప్రదించాలని సూచించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్, కార్యదర్శి పిట్టా దామోదరరావు, న్యాయవాదులు జి.ఇందిరా ప్రసాద్, ఆశ్రమ ఇన్‌చార్జి పి.సాయి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా ఆయుష్మాన్ భారత్

శ్రీకాకుళం అర్బన్: నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధుల సంక్షేమం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ జనఆరోగ్య మిషన్ సత్ఫలితాలు ఇస్తోందని ఎన్‌టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రకాశరావు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 70 ఏళ్లు దాటిన వృద్ధులంతా సమీప ఆరోగ్య కార్యకర్తను కలిసి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు పొందాలని సూచించారు.

గత ఏడాది జిల్లాలో సుమారు 57 వేల మంది రోగులకు ఆరోగ్య శ్రీ పథకం కింద సేవలు అందించామని, దీని కోసం సుమారు రూ.120 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, శాసపు జోగినాయుడు, బి.వి.రవిశంకర్, జి.లక్ష్మీ, డాక్టర్ జి.ఎస్.రావు, డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాదరావు, అడపా శాంతి, గుడ్ల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- ఎచ్చెర్ల ఎంపీపీ చిరంజీవి



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన సబ్సిడీ విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో పలు విషయాలపై చర్చించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు చెప్పారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా నివారణ చర్యలు చేపట్టాలని, విద్యుత్ సమస్యలు తరచూ వస్తుండం వలన సంబంధిత శాఖ వారు చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్‌కు సాగు నీటి సమస్యలు తలెత్తకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణా చర్యలు, ఫీవర్ సర్వేలను నిర్వహించాలని కోరారు. ఉపాధి మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన పనులను అధికారులు త్వరగా రికార్డు చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామ్మోహనరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షకు 28 మంది గైర్హాజరు

ఎచ్చెర్ల: ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకాలకు నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ పరీక్షలు కొనసాగుతున్నాయి. చిలకపాలెంలోని శ్రీశివాణీ ఇంజినీరింగ్, ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాలుగా శుక్రవారం నిర్వహించిన పరీక్షలకు రెండు షిఫ్టుల్లో కలిపి 761 మంది హాజరు కావాల్సి ఉండగా 733 మంది హాజరయ్యారు. 28 మంది గైర్హాజరైనట్టు పరీక్షల పర్యవేక్షక అధికారులు వెల్లడించారు.

చాపురంలో సమస్యల కొలువు

- వెలగని విద్యుత్ లైట్లు
- పనిచేయని బోర్లు
- అధ్వానంగా రహదారులు



మొరాయించిన బోరు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని చాపురం గ్రామం సమస్యలతో సతమతమవుతోంది. సుమారు 300 కుటుంబాలు నివాసముంటున్న ఈ గ్రామంలో గతంలో ఏ సమస్య వచ్చినా వెంటనే చాపురం పంచాయతీ అధికారులు పరిష్కరించేవారు. నేడు మున్సిపాల్టీలో విలీనం కావడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. రోడ్లు గతుకులమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. వీధిలైట్లు సక్రమంగా వెలగకపోవడంతో రాత్రిపూట అంధకారం అలముకుంటోంది. కొద్ది నెలలుగా బోరు పనిచేయకపోయినా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గోతులమయంగా మారిన చాపురం రోడ్డు

బోర్లు పనిచేయడం లేదు



గ్రామంలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, మెయిన్ వీధికి సంబంధించిన బోరు మూడు నెలలుగా పని చేయడం లేదు. వేసవిలో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. మున్సిపాల్టీ ద్వారా అరకొరగానే నీరు వస్తోంది. ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు.

– అల్లు రామారావు, చాపురం



మరమ్మతుకు నోచుకోని విద్యుత్ లైట్లు

అధ్వానంగా రోడ్డు



రాజకీయ నాయకులు, అధికారులు మారుతున్నారే తప్ప రోడ్డు మాత్రం బాగుపడటం లేదు. కొద్దిపాటి వర్షం పడినా రోడ్డు అంతటా నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. గతుకులు కూడా ఎక్కువగా ఉన్నాయి. అధికారులు మరమ్మతులు చేయించాలి.

– ఎ.అనిల్‌కుమార్, చాపురం

వీధిలైట్లు వెలగడం లేదు..



గ్రామంలో రెండు నెలలుగా వీధిలైట్లు వెలగడం లేదు. మున్సిపాల్టీ యంత్రాంగానికి ఫిర్యాదు చేస్తే చూస్తాం..చేస్తాం.. అంటున్నారు తప్ప పరిష్కరించడం లేదు. రాత్రోయితే చాలు వీధి అంధకారంగా మారుతోంది. అధికారులు స్పందించాలి.

– లక్ష్మణరావు, చాపురం